

ఎన్నికలు, గ్రూప్–1లకు పటిష్ట ఏర్పాట్లు

మెయిన్‌లో...

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శుక్రవారం | 17 మే, 2024 | పేజీలు : 4

# నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు

### తీన్మార్ మల్లన్నను గెలిపించాలి : ఎమ్మెల్యే జైవీర్



మెయిన్‌లో...

# బిజెపి ప్రభుత్వం చేసిందేమీలేదు

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్



మెయిన్‌లో...

# ఎంఎల్‌సిగా తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

### ఎంఎల్‌ఎ బాలునాయక్

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి





**ప్రజాపక్షం/దేవరకొండ :** సిపిఐ, ప్రజా సంఘాలు బలపరిచిన ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి తీన్మార్ మల్లన్నను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలు నాయక్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డిలు పట్టభద్రులకు పిలుపునిచ్చారు. గురువారం దేవరకొండలోని పిపిఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన పట్టభద్రుల సమావేశానిలో వారు మాట్లాడుతూ తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రాజ్యాంగాన్ని నాశనం చేయాలని బిజెపి కుట్రలు చేస్తుందని, రాజ్యాంగాన్ని మార్చి గిరిజనులు, దళితులు,వెనుకబడిన వర్గాలకు కల్పించిన రిజర్వేషన్లను రద్దు చేయాలని బిజెపి కోరుకుంటుందని ఆరోపించారు. బిజెపి గెలిస్తే ప్రభుత్వ రంగాన్ని మొత్తం ప్రైవేటికరణ చేయడం ఖాయం అని ఎంఎల్‌సి ఉప ఎన్నిక అత్యంత కీలకమని కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూనే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని, రానున్న రోజుల్లో యువతకు ప్రభుత్వం పెద్దపీట వేసేందుకు ధృఢ సంకల్పంతో ఉందని అన్నారు. ప్రభుత్వ పరంగా యువతకు కావాల్సిన అన్ని విషయాల్లో పూర్తి అవగాహన ఉన్నటువంటి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అభ్యర్థి మల్లన్న మాట్లాడుతూ ఉద్యోగులు, నిరుద్యోగుల పక్షాన నిలబడి రాష్ట్ర ప్రభుత్వం చేత అన్ని విధాలుగా అవసరం అయ్యే కార్యక్రమాలు చేసేందుకు ముందుంటానని, యువతకు ఉపాధి కల్పనకై ప్రభుత్వం ఉపాధి ఉద్యోగ కల్పన కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు శంకర్‌నాయక్, గుత్తా అమిత్‌రెడ్డి, సిరాజ్ ఖాన్, పిఏసిఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, వేణుధర్‌రెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు వెంకటరమణ, బుచ్చిరెడ్డి, మైనోద్దీన్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహా, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు ధనలక్ష్మి, రాంసింగ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, హరికృష్ణ, సర్వయ్య, వెంకటయ్య, రుక్మారెడ్డి, రాజేష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి

### జిల్లా ఎస్‌పి చందనా దీప్తి



**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ, ఖమ్మం, వరంగల్ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని జిల్లా ఎస్‌పి చందనా దీప్తి తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నియమ నిబంధనల పరిధి దాటకుండా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉంటుందన్నారు. అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, సభలు, సమావేశాలకు సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలని వారి ప్రసంగాలలో ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని అన్నారు. అభ్యర్థులు వారి ప్రచారంలో కులం, మతం, ఎదుటి వ్యక్తులను దూషించడం, ప్రార్థనా స్థలాలలో ప్రచారం వంటివి చేయకూడదని ,ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురి చేయవద్దన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఇతరుల ఇండ్ల గోడలపై రాతలు రాయటం, హోర్డింగులు ఏర్పాటు చేయడం వంటివి చేయవద్దని అన్నారు. సోషల్ మీడియాలో ఇతరులను కించపరిచే విధంగా పోస్ట్‌లు పెట్టరాదని అన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏదైనా ఫిర్యాదులు చేయవలసి వస్తే సివిజిల్ ద్వారా అప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని అన్నారు.

# లారీలలోని ధాన్యాన్ని అన్‌లోడ్ చేయాలి

### అడిషనల్ కలెక్టర్ పి.బెన్ షాలోమ్



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** రైస్ మిల్లుల వద్ద లారీలలో ఉన్న ధాన్యాన్ని త్వరగా అన్ లోడ్ చేయించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టరు పి.బెన్ షాలోమ్ మిల్లర్లను ఆదేశించారు.గురువారం ఆయన కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో రైసు మిల్లుల ప్రతినిధులతో ధాన్యం కొనుగోళ్లను సమీక్షించారు. మిల్లులకు ఇచ్చిన కెపాసిటీని పూర్తి చేయాలని ఆదేశించారు. రైతుల నుండి కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూసి ధాన్యం అదనపు నిల్వల కొరకు రైస్ మిల్లులలో అవసరమైన స్థలాన్ని సేకరించుకోవాలని చెప్పారు.ఎంచుకున్న స్థలంలో ధాన్యం లారీలను త్వరగా అన్ లోడ్ చేయించాలని, ఆ వెంటనే ఆన్ లైన్ నమోదు చేయాలని ఆదేశించారు.ఇప్పటి వరకు జిల్లాలో 524 కోట్ల రూపాయల విలువ గల 2 లక్షల 39 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని ఈ సందర్భంగా తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజరు గోపీకృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస రెడ్డి, జిల్లా రైస్ మిల్లుల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మల్లారెడ్డి, మిల్లుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీసాయిదత్త ఆశ్రమ నాగసాయి మందిర వార్షికోత్సవం



**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** పట్టణంలోని రైల్వే కాలనీలోగల శ్రీసాయి దత్త ఆశ్రమంలో శ్రీనాగ సాయి విగ్రహ ప్రతిష్ట 14వ వార్షికోత్సవ వేడుకలు గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామున శ్రీపంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం ఆలయ ప్రధాన కార్యదర్శి నరేందర్ ఆధ్వర్యంలో 21 కిలోల పూలతో సాయినాధుడికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మధ్యాహ్నం శ్రీసాయినాధుడికి పల్లకి ఉత్సవాన్ని మేళతాళాల నడుమ ఘనంగా నిర్వహించారు. పట్టణ పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున దంపతులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు గుండా శ్రీనివాస్, గుడుగుంట నరేందర్, మట్టయ్య, సోమన్న, పందిరి సత్యనారాయణ, జగన్నాధరావు, జానకిరాముడు, రవికిరణ్, విక్రమ్, వెంకన్న, అంజిబాబు, అరుణ, భాగ్యలక్ష్మి , పద్మ, కల్యాణి, భవాని, శారద తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుడికి రోబోటిక్ కృత్రిమకాలు అందచేత



**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** పట్టణానికి చెందిన పోరెడ్డి స్వరాజ్యలక్ష్మి ఆమె భర్త పోరెడ్డి సత్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి ఆద్వర్యంలో గురువారం వికలాంగుడైన వేపచేదుల సైదులుకు రూ.2లక్షల విలువగల రోబోటిక్ లెగ్ (కృత్రిమకాలు)ను అందచేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ ఇటీవల అనారోగ్య కారణాలతో తన కాలు తీసివేసినట్లు తెలిపారు. కృత్రిమకాలు అందచేసిన స్వరాజ్యలక్ష్మి కి సైదులు కృతజ్ఞతలు తెలియజేశారు. కృత్రిమ కాలు వలన ఎప్పటిలాగానే పనులు చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకోనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో పట్టణ యూత్ కాంగ్రెస్ నాయకులు ఇంజమూరి శ్రీకాంత్, ఇంజమూరి పున్నయ్య, గోపి పాల్గొన్నారు.

## వేసవి క్రీడల శిక్షణ ముగింపు

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** 15 రోజులుగా డి రాపాక గ్రామంలో కృషి యూత్ కల్చరల్ అసోసియేషన్ అండ్ ఉన్న ఊరు కన్నతల్లి సామాజిక చైతన్య సేవా సంస్థ ఆధ్వర్యంలో 2024 వేసవి శిక్షణ క్రీడలను ముగింపు చేస్తూ శుక్రవారం క్రీడల్లో పాల్గొన్న పిల్లలందరికీ మెమెంటోస్ మరియు మెడల్స్ అందజేశారు. పిల్లలు వేసవిలో బైట ఎండలో తిరగకుండా, ఫోన్‌లలో కాలక్షేపం చేయకుండా అందరు కలిసి మెలిసి ఉండేట్లుగా చేసిన కృషి యూత్ సైనికులకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. కృషియూత్ క్లబ్ మీద నమ్మకంతో పిల్లల్ని నిర్వహించిన వేసవి క్రీడల శిక్షణకి పంపించిన ప్రతి తల్లిదండ్రులకి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దయచేసి మీ పిల్లలను ఇకనుండి జాగ్రత్తగా చూస్కోండి. ముఖ్యంగా ఫోన్‌లకు, టీవీలకు దూరంగా ఉంచి పుస్తకానికి దగ్గర చేయండి అని కృషి యూత్ క్లబ్ డీ రేపాక కోరింది.

## కామ్రేడ్ మారోజు వీరన్నకు ఘన నివాళులు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** దళిత బహుజన భారత విప్లవోద్యమ పోరాటంలో అమరత్వం పొందిన అమరవీరులను స్మరిస్తూ మారోజు వీరన్న 25 వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ రెవల్యూషన్ ఆఫ్ మారోజు ఆర్గనైజింగ్ సెక్రటరీ మారోజు నరసయ్య అధ్యక్షతన జరిగిన మహాత్మజ్యోతి బాపూలే విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమానికి వివిధ విప్లవ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని వీరన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ(ఎంఎల్) చంద్ర పుల్లారెడ్డి,పార్టీ రాష్ట్ర నాయకులు బుద్ధ సత్యనారాయణ,సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ లింగంపల్లి భద్రయ్యలు మాట్లాడుతూ భారతదేవ విప్లవ రాజకీయాల్లో దశదిశ నిర్దేశించి మార్గం చూపించిన వ్యక్తి వీరన్న ప్రపంచంలో ఎక్కడా లేని కులవ్యవస్థను మన భారతదేశంలో ఉన్నదని గుర్తించి అనేక దళిత,బహుజన కులసంఘాలను ఏర్పాటు చేసి బహుజన శ్రామిక రాజ్యస్థాపనే వీరన్న లక్ష్యంతో పోరాటాలు కొనసాగించాలన్నారు.మూడు దశాబ్దాల క్రితమే పసిగట్టి మతోన్మాదం మీద మాట్లాడినందుకే వీరన్న రాజ్యం ఎన్‌కౌంటర్ చేసిందని కొనియాడారు.వీరన్న భౌతికంగా మన మధ్యలో లేకున్నా వీరన్న అందించిన కులవర్గ సిద్ధాంతాన్ని పోరాటాలను నిర్మాణ రూపంలో ప్రస్తుతం ప్రత్యక్ష రాజకీయాలు నిర్మాణం బాధ్యత కమ్యూనిస్టు బహుజనులదే అన్నారు.మహనీయులు కన్న కలలు నిజం చేసినప్పుడే వారికి మనము అర్పించే ఘన నివాళులన్నారు. కార్యక్రమంలో సియుసి నాయకులు కరీం, అడ్వకేట్ వీరన్న, నల్లగుంట్ల అయోధ్య, వీరన్న సోదరి దేవకమ్మ, సామాజిక తెలంగాణ మహాసభ నాయకులు దడిపల్లి వెంకట్, జానిమియా,శ్రీనివాస్, డాక్టర్ కర్ణాకర్ , వెంకన్న పాల్గొన్నారు.

## రైతుల సమస్యలను పరిష్కరించాలి : మాజీ ఎంఎల్ఎ



**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి అన్నారు. గురువారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపుమేరకు పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందచేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తిప్పన విజయసింహారెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ముగియగానే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసే పని పెట్టుకుందన్నారు. రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు కేవలం సన్న రకం ధాన్యానికే రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం దారుణమన్నారు. తెలంగాణాలో 90శాతం మంది రైతులు దొడ్డురకం ధాన్యాన్నే పండిస్తారని, ఈ విషయం తెలిసి కూడా ప్రభుత్వం ఇలాంటి ప్రకటన చేయడమేంటన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన అన్నిరకాల వరి ధాన్యానికి బోనస్ రూ.500 ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జడ్పీటీసీ ఆంగోతు లలితహాతీరాం, నాయకులు పెండ్యాల పద్మ, అమరావతి సైదులు, చిట్టిబాబునాయక్, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మోసిన్‌అలీ, పాలుట్ల బాబయ్య, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, వెలిశెట్టి రామకృష్ణ, అబ్దుల్ కరీం, పునాటి లక్ష్మి నారాయణ, తలకోన శ్రీధర్‌రెడ్డి, సాధినేని శ్రీనివాస్, చాంద్‌పాషా, మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, పశ్యా శ్రీనివాస్‌రెడ్డి, అంజన్‌రాజు, గుడిసె దుర్గాప్రసాద్, గంటా శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, కోదాటి రమా తదితరులు పాల్గొన్నారు.

## వడ్లు కొనుగోలు చేయాలని రైతుల ధర్నా



**ప్రజాపక్షం / రామన్నపేట :** మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసి రైతుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం, రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అధికారులు స్పందించకపోవడంతో రోడ్లపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జల్లెల పెంటయ్యలు మాట్లాడుతూ మండలంలో 26 కేంద్రాల్లో ధాన్యం రాశులు పోసి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో రోజుల తరబడి రైతులు పడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు ఇటీవల కురిసిన వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తి రంగు మారడంతో రైస్ మిల్లులు కొనడం లేదన్నారు. రామన్నపేటలో రైస్ మిల్లుల పరిమితి పూర్తికావడంతో లారీల కొరత ఏర్పడి రోజుల తరబడి ధాన్యం కుప్పల వద్ద కాపలా కాయాల్సి వస్తుందన్నారు. పట్టాల కిరాయి పెరిగి ఆర్థిక భారం మోయాల్సి వస్తుందన్నారు. ఓ వైపు కరువు సంభవించి అరకొర పంట పండితే చేతకొచ్చిన ధాన్యం కొనేవారు లేక దళారులకు తక్కువ ధరకు అమ్ముకోని రైతులు అప్పుల పాలు కావాల్సి వస్తుందన్నారు. ఓట్లు కొనుగోలు చేసే పాలక పార్టీలకు వడ్లు కొనుగోలు చేసే శక్తి లేదా అని ప్రశ్నించారు ఆరుగాలం కష్టించి పండించిన పంటకు ప్రతిఫలం రాక రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వ యంత్రాంగం చోద్యం చూస్తుందన్నారు. వెంటనే యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ ముందు వేలాది మందితో ధర్నా నిర్వహిస్తామన్నారు. రైతులు చేస్తున్న ధర్నా వద్దకు స్థానిక తహసీల్దార్ లాల్ బహదూర్, ఏపీవో, పీఏసీఎస్, సీఈవో వచ్చి సంబంధిత అధికారులతో మాట్లాడి నాలుగు రోజుల్లో కొనుగోలు పూర్తి చేస్తామని హామి ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, సింగిల్ విండో వైస్ ఛైర్మన్ అంబటి ఉపేంద్ర, రవీందర్ రెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు గన్నెబోయిన విజయభాస్కర్, నాయకులు కల్లూరి సైదమ్మనగేష్, గాదె నరేందర్, వనం ఉపేందర్, గొరిగె సోములు, కందుల హనుమంతు, బల్గూరి అంజయ్య, బావండ్లపల్లి బాలరాజు, మేడబోయిన శ్రీనివాస్, వేముల సైదులు, చంద్రశేఖర్, మేడి గణేష్, ఎర్ర కాటమయ్య, తొలుపునూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను గెలిపించండి



**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బీసీ సంస్కృతిక సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ధూళిపాళ ధనుంజయనాయుడు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన పట్టణంలో మాట్లాడుతూ గత పది సంవత్సరాల కాలంగా గత ప్రభుత్వం చేసిన వాగ్ధానాలను అమలు కోసం ప్రశ్నించే గొంతుకగా రాజీ పడకుండా, భయపడకుండా కేసులకు వెరవకుండా జైళ్లపాలైనా ప్రజా గొంతుకగా నిలిచిన తీన్మార్ మల్లన్నను గెలిపించాల్సిన బాధ్యత పట్టభద్రులపై ఉందన్నారు. ఎన్నికలకు ముందే తన పేరుతో, తన భార్య పేరుతో ఉన్న ఆస్తులన్ని ప్రభుత్వపరం చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిచాడని, అతని ఆదర్శానికి బహుమతిగా ప్రతి పట్టభద్రుడు తీన్మార్ మల్లన్నకు పట్టం కట్టాలని, గతంలో ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేసే ముందు తమ ఆస్తులను ప్రభుత్వపరం చేసిన చరిత్ర ఉందాన అని ఆయన ప్రశ్నించారు. ప్రజల పక్షాన ముఖ్యంగా యువతరం పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం తాపత్రయపడిన ప్రజాగొంతుక తీన్మార్ మల్లన్న అని ఇలాంటి వ్యక్తి శాసనమండలిలో ఉంటే ప్రధానంగా నిరుద్యోగ సమస్యపై తన గళం విప్పుతాడని అన్నారు. ప్రతి పట్టభద్రుడు లోతుగా ఆలోచణ చేసి తీన్మార్ మల్లన్నను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## కార్యకర్తకు వీడ్కోలు పలికిన సంకినేని



**ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎస్) :** భారతీయ జనతా పార్టీ సోషల్ మీడియా పార్లమెంట్ కో కన్వీనర్ కొప్పుల క్రాంతిరెడ్డి రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడంతో అంత్యక్రియలనువారి గ్రామం ఆత్మకూర్(ఎస్) గ్రామంలో నిర్వహించడం జరిగింది. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు, బిజెపి ఎంపి అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సూర్యాపేట నియోజకవర్గ నాయకులందరూ అంతిమయాత్రలో పాల్గొని పార్టీలో తమతో కలిసి పనిచేసిన కొప్పుల క్రాంతిరెడ్డికి కన్నీటితో ఘనంగా వీడ్కోలు పలికారు.

## ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలి



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని బిఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ఉప్పు కృష్ణ డిమాండ్ చేశారు. రైతులకు ఎకరానికి రూ.15 వేలు, కౌలు రైతులకు రూ.12వేలు రైతు బరోసా ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని విమర్శించారు. రైతాంగానికి కరెంట్ కోతలు పెడుతూ కాల్వల్లోకి సాగు నీరు కూడ వదలడం లేదని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చి రెండు నెలలు గడుస్తున్న కొనుగోలు చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫి హామీ అమలు చేయకుండా ఆగస్టు 15 వరకు చేస్తామని పబ్బం గడుపుతున్నారని అన్నారు.కాంగ్రెస్ బోగస్ హామీలతో అధికారంలోకి వచ్చిందని, ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెప్తారని తెలిపారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజలతో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు.

## రైల్వే అండర్‌పాస్ పనుల పరిశీలన

**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు అండర్ పాసు ఎన్ని రోజుల కల నెరవేరుతుందని ఆలేరు ప్రజలు అనుకున్న సమయంలో ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బిర్లా ఐలయ్య సహకారంతో రైల్వే అండర్ పాస్ పనులను ఇటీవల ప్రారంభించారు. పట్టణానికి చెందిన ఓబీసీ మెంబర్ ఎగిడి శ్రీశైలం గురువారం చేస్తున్న పనులను పరిశీలించారు. వర్షాకాలం ఉన్నందున తొందరగా పనులు చేయాలని కాంట్రాక్టర్లను కోరారు. వారి వెంబడి కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# పరిసరాల పరిశుభ్రతను పాటించాలి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్ : ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పంచాయతీ కార్యదర్శి మంత్రిప్రగడ గిరిజకుమారి అన్నారు.గురువారం మండలంలోని వేపలసింగారం గ్రామంలో పారిశుధ్య వారోత్సవాలలో భాగంగా పలు వీధుల్లో ని డ్రైనేజీలలో పేరుకపోయిన పూడికతీత పనులను ఆమె పరి శీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారోత్సవాలలో భాగంగా డ్రైనేజీలలో మురుగునీరు,చెత్త తొలగించి నీరు వెళ్లే టట్లు చేయడం జరిగిందన్నారు. స్వచ్ఛ వేపలసింగారంగా చేసేందుకు గ్రామంలో ని ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ముస్తఫా,సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాలను నిలిపివేయాలి...



ప్రజాపక్షం/నాంపల్లి : కోర్టు పరిధిలో ఉన్న ఉద్యోగుల భవన స్థలంలో జరుగుతున్న అక్రమ కట్టడాలను నిలిపివేయాలని గురువారం ఉద్యోగ, ఉపాధ్యాయ నాయకులు గేర నర్సింహ, గాదెపాక రామ చంద్రం, సిలువేరు నారాయణలు కోరారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అంబేద్కర్ చౌరస్తాలో గల ఆల్ ఎంప్లాయిస్ భవనంలో అక్రమ కట్టడాలను చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ఆ భవన స్థలం కోర్టు పరిధిలో ఉందని దానికి సంబంధించిన నోటిసులు కూడా పంపామని, కోర్టు తీర్పు వచ్చేంత వరకు ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ప్రభుత్వ అధికారులు కాపాడాలని న్యాయ పోరాటం చేసి తమ ప్రభుత్వ భవన స్థలాన్ని కాపాడుకుంటామని వారు అన్నారు.

# పట్టపగలు వెలుగుతున్న వీధి దీపాలు

ప్రజాపక్షం/గుండాల : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాంపురం గ్రామంలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వేసిన లైట్లు ఇప్పటికి వెలుగుతూనే ఉన్నాయని అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని గ్రామస్థులు మాట్లాడుకుంటున్నారు. వీధి దీపాలు సమయం సందర్భం లేకుండా వెలుగుతూనే ఉండడం, వీధి దీపాలను అపాలనే ఉద్దేశ్యంలో అధికారుల నిర్లక్ష్యం కనబడుతుంది. రోజుల తరబడి గ్రామంలో వీధి దీపాలు వెలగడంతో విద్యుత్ వృధా అయి ప్రభుత్వంపై భారం పడుతుందని గ్రామస్తులు అనుకుంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఉదయం సమయంలో వెలుగుతున్న వీధి దీపాలను అపాలని కోరుతున్నారు.

# తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కొనుగోళ్లు వేగవంతం చేసి రైస్ మిల్లులకు ధాన్యాన్ని వెంటనే తరలించాలని డిఆర్‌డిఓ అధికారి ఎంఏ కృష్ణన్ చెప్పారు. మండల వ్యాప్తంగా రైతులు చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో ఆయన గురువారం శివారెడ్డి గూడెంలో ఉన్న ఐకెపి సెంటర్‌ను సందర్శించారు. రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు రిజిస్టర్ ట్రక్ షీట్లను ఆయన పరిశీలించారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేయకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ఎంపీడీవో భాస్కర్ ఏపీఎం రజిత సెక్రటరీ పి పి సి నిర్వాహకులు ఐకెపి మహిళలు రైతులు ఆయన వెంట ఉన్నారు.

# లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి జైలుశిక్ష

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : పట్టణంలోని గాంధీనగర్ కు చెందిన జింకల శ్రీకాంత్ మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ నేరానికి రూ.2వేల జరిమానాతో పాటు 6 నెలల కఠిన జైలు శిక్ష విధిస్తూ చౌటుప్పల్ కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఈ మేరకు స్థానిక ఎస్సై భాస్కర్ రెడ్డి బుధవారం రాత్రి మీడియాకు ఒక ప్రకటనలో తెలిపారు. నేరస్తుడు 2016లో మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ బాధిత మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పూర్వ ఎస్సై ఆర్.జగన్మోహన్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి రిమాండుకు పంపారు. పోలీస్ సాయి కుమార్, హోంగార్డు శివ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కోర్టు విచారణలో సాక్ష్యాధారాలు ఋజువైనందున నిందితుడికి శిక్ష విధిస్తూ సోమవారం చౌటుప్పల్ కోర్టు న్యాయమూర్తి తుది తీర్పు ఖరారు చేసారు.

# రోజుకు రెండు లారీలు లోడ్ చేసి 24గంటల్లో అన్‌లోడ్ చేయాలి




ప్రజాపక్షం/ రామన్నపేట : ధాన్యం మార్కెట్ కేంద్రాల్లో రోజుకు రెండు లారీలు లోడ్ చేసి 24గంటల్లో అన్‌లోడ్ చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు కన్నెకంటి వెంకటేశ్వరచారి, మండల కిసాన్ మోర్చ అధ్యక్షుడు గుండాల అంజయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల ఇన్‌చార్జి కడారి వెంకటేష్లతో కలిసి దుబ్బాక గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులను సమస్యలను అడిగి తెలుసుకోని మాట్లాడారు. సెంటర్లు ప్రారంభించి రెండు నెలలు కావొస్తున్నా ఇప్పటివరకు సక్రమంగా కాంటాలు కాకపోవడంతో బార్దాన్ అందుబాటులో లేకపోవడం, వడ్లు లోడ్ అయినా, అన్‌లోడ్ కాకుండా, అన్‌లోడ్ అయిన వారానికి వడ్లు షార్ట్ వచ్చాయని రైతులకు చెప్పి యంత్రాంతం నానా ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. రోజుల తరబడి రైతులు వడ్ల కుప్పల వద్ద కావలి ఉండాల్సి వస్తుందన్నారు. రైతుకు పట్టాల కిరాయి భారం అవుతుందని, ఇప్పటికే వడ్లు మొలకలు రావడం జరిగిందన్నారు. ఇప్పటికే సీజన్ ప్రారంభమై దున్నకాలు మొదలయ్యాయని, ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు వేగం పెంచి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము యాదయ్య, గట్టు బాల్‌రెడ్డి, క్యాస సత్యనారాయణ, మామిండ్ల కృష్ణ, రాపోలు రమేష్, సింగం లింగస్వామి, హనుమంతరావు, బొత్కు అశోక్, గుడాల మహేందర్, జలక వీరేశం, శుభకూటి కృష్ణమాచారి, శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్‌చారి, రైతులు వీరస్వామి, మల్లారెడ్డి, భిక్షం, లింగరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎరుకల నాంచారమ్మ జాతరను విజయవంతం చేయాలి



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : భూదాన్ పోచంపల్లి మండలంలోని పిల్లాయిపల్లి గ్రామంలో ఈ నెల 21,22,23 మూడు రోజుల పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్న ఎరుకల నాంచారమ్మ జాతరను విజయవంతం చేయాలని అధికారులతో పాటు గ్రామస్తులను చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం ఏర్పాట్లపై అధికారులూ అఖిలపక్ష నాయకులు దేవాలయం కమిటీ సభ్యులు గ్రామస్తులతో సమీక్షా సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ రాష్ట్ర జాతరలో అమ్మవారిని పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు పలు ప్రజా ప్రతినిధులు భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకోనున్నారు. కాబట్టి అన్ని ప్రత్యేక సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దేవాలయానికి,ఉత్సవాలకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.అన్ని విభేదాలను ప్రక్కన పెట్టి గ్రామ ప్రజలందరూ సమిష్టిగా జాతరను విజయవంతం చేయాలని కోరారు.ఎలాంటి అసౌకర్యాలకు తావు లేకుండా వ్యవహరించాల్సిన బాధ్యత అధికారులదని గుర్తుచేశారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఓ అధికారి కృష్ణన్,ఎండీఓ భాస్కర్,ఎమ్మార్వో శ్రీకాంత్ రెడ్డి,ఎంవో శ్రీవాణి, ఎస్సై భాస్కర్ రెడ్డి,ఆర్‌ఐ వెంకట్ రెడ్డి,ఏఈ వెంకటేశ్వర్లు, డిసిసి ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి,బందారపు లక్ష్మణ్ గౌడ్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫారం తగిలి గేదే మృతి



ప్రజాపక్షం/ఆలేరు : ప్రమాదవశత్తు ట్రాన్సారం తగిలి పాడి గేదే అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గొలనుకొండలో చోటుచేసుకుంది. గురువారం ఆలేరు మండలం గొలనుకొండ గ్రామానికి చెందిన రైతు బురెడ్డి యాదిరెడ్డి పాడి గేదే ఉదయం ఏడు గంటల సమయంలో మేత మేస్తుంటూ తమ వ్యవసాయ భూమిలో కిందికి ఉన్నటువంటి ట్రాన్సారం తగిలి గేదే అక్కడికక్కడే మృతి చెందింది. రైతు మాట్లాడుతూ గతంలో ఇదే ట్రాన్సారం తగిలి మూడు గేదెలు మరణించాయని ఎన్నిసార్లు విద్యుత్ శాఖ అధికారులకు చెప్పిన పట్టింపు లేదన్నారు. గేదె విలువ రూ.75 వేల ఉంటుంది. గ్రామ ఎంపీటీసీ బాకీ లక్ష్మి రా మల్లయ్య తండా యాదగిరి బంధారపు మధు, భీమగాని హరిబాబు, రైతును పరామర్శించి ప్రభుత్వం ఆదుకోవాలని తెలిపారు.

# జాతీయ డెంగ్యూ నివారణ కార్యక్రమం



ప్రజాపక్షం/గుండాల : జాతీయ డెంగ్యూ నివారణ సందర్భంగా గురువ్వారం మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పిహెచ్‌సి డా. హేమావతి మాట్లాడుతూ డెంగ్యూ నివారణకు ప్రజలు పరిశుభ్రతను పాటించాలని, దోమల నివారణకు నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాబోయేది వానాకాలం కావడంలో డెంగ్యూ జ్వరాలు, సిజనల్ వ్యాధులు ప్రభలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా. ప్రత్యుషా, నాగమణి, ఉపేంద్ర ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా బీర్ల ఫౌండేషన్



ప్రజాపక్షం/గుండాల : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రానికి చెందిన కర్నే శేఖర్ ప్రమాదంలో తన వెన్ను పూస విరగడంతో నిరుపేద కుటుంబానికి చెందిన శేఖర్ హైదరాబాద్‌లోని ఆసుపత్రికి వెళ్ళాలంటే ఆర్థిక స్తోమత లేకపోవడంతో విషయం తెలుసుకున్న బీర్ల ఫౌండేషన్ వైస్ చైర్మన్ యాదగిరిగౌడ్ తక్షణమే స్పందించి బీర్ల ఫౌండేషన్ అంబులెన్స్‌ను ఏర్పాటు చేయడం జ రిగింది. నిరుపేద కుటుంబాలకు అండగా బీర్ల ఫౌండేషన్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని వారి సేవలు మరువలేనివని గ్రామస్తులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ షర్ఫొద్దీన్, డా. వెంకన్న, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# సాయినాథున్ని దర్శించుకున్న మల్లన్న



ప్రజాపక్షం/చింతపల్లి : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి తీన్‌మార్ మల్లన్న గురువారం మండల కేంద్రంలోని సాయినాథున్ని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ మల్లన్నను ఘనంగా సత్కరించి, సాయినాథుని చిత్ర పటాన్ని అందజేశారు. అనంతరం దేవరకొండలో జరిగే ఎంఎల్‌సి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి హాజరయ్యారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ముచ్చర్ల గిరి, ఎంపిటిసి నల్లవెల్లి సదానందం, లింగంపల్లి వెంకటయ్య, సలీమ్, రవి, శ్రీను తదితరులు ఉన్నారు.

# సాగర్‌ను సందర్శించిన రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ



ప్రజాపక్షం/నందికొండ : ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను గురువారం రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ నాగార్జునసాగర్ ను సందర్శించారు. ఆయనకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్ ఈ నాగేశ్వరరావు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆ తర్వాత ప్రాజెక్ట్ అధికారులు వీరికి నాగార్జునసాగర్ మోడల్ డ్యామ్ కు సంబంధించిన విశేషాలను,నాగార్జున సాగర్ ప్రాజెక్టు యొక్క విశిష్టతను, దాని పని తీరును తెలియజేశారు. అదేవిధంగా ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణా సంబసరిహద్దు వివరాలను,ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థం, ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు పని చేసే విధానాన్ని, విద్యుత్ ఉత్పత్తి గురించి వివరించారు. వీరితో పాటు ప్రాజెక్టు ఎస్ ఈ నాగేశ్వర రావు,ఎస్ పి ఎఫ్ ఆర్ ఐ భాస్కర్ రెడ్డి,ఏఈఈ లు కృష్ణయ్య, సత్యనారాయణ, బిక్షపతి లు ఉన్నారు.

## రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి

ప్రజాపక్షం/దేవరకొండ : నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో బిఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ రమావత్ రవీంద్రకుమార్ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు.గురువారం పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కావాల్సింది అధికార స్వరాలు కాదని, ధిక్కార స్వరాలు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలు కావాలని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేయాలంటే ప్రశ్నించే రాకేష్‌రెడ్డి లాంటి ఉత్సాహవంతుడు యువకుడైన వ్యక్తి మండలికి ఎన్నిక కావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాజీ గ్రంథాల చైర్మన్ రేగటి మల్లికార్జున్ రెడ్డి, ఎంపిపి మాధవరం సునిత, వైస్ ఎంపిపి సుభాష్, మండల అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్‌రెడి, వల్లపురెడ్డి, దస్రు, తిరుపతయ్య, ఆంజనేయులు, గిరిధర్, లింగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజు, కృష్ణ, రమేష్, శంకర్, బాలు, రవి, ప్రసాద్, బాబా, సురేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

## భారత ఆహార సంస్థ ఉద్యోగులు క్షేత్రస్థాయి శిక్షణకు ఎంపిక

ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ : భారత ఆహార సంస్థ నల్లగొండ కార్యాలయంలో నూతనంగా ఉద్యోగంలో చేరిన వారిలో మొదటి విడతగా ఏడు గురిని సంస్థ హైదరాబాదు ప్రాంతీయ కార్యాలయం ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయి శిక్షణకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సంస్థ నల్లగొండ డివిజనల్ మేనేజర్ సుశీల్ కుమార్ సింగ్ మాట్లాడుతూ నూతన బ్యాచ్ వారికి రెండు వారాల పాటు సంస్థ యొక్క ప్రధాన విభాగాలైన ప్రొక్యూర్మెంట్, స్టోరేజ్, కాంట్రాక్ట్ వంటి వాటితో పాటు ఇతర విభాగాల గురించి సమగ్ర అవగాహన పొందేవిధంగా శిక్షణ ఇస్తారని, అదేవిధంగా, సంస్థ గోదాముల్లో నాణ్యత నియంత్రణ, డిపో కార్యక్రమాల గురించి కూడా అవగాహన కల్పిస్తారని అన్నారు. శిక్షణార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.పెరుగుతున్న సాంకేతికత వాడకాన్ని మరింత ఆకళింపు చేసుకుని, తద్వారా సంస్థ పురోగతికి తోడ్పడాలని ఆయన అభిలషించారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రసాద్, ఉద్యోగులు అజయ్, ముకేష్, లచిరాం, గిరిప్ప, పాల్, లక్ష్మి పార్వతి, లలిత, యూనియన్ ప్రతినిధి సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధితో వినియోగదారుల మన్ననలను పొందాలి



ప్రజాపక్షం/నల్లగొండ : పట్టణంలోని మిర్యాలగూడ రోడ్‌లో శ్రీనివాస సూపర్ మార్కెట్ ను మార్కెట్ కమిటీ చైర్మన్ జూపూడి రమేష్ ప్రారంభించి మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అవసరమైన సరుకులను నాణ్యతతో వినియోగదారులను ఆకట్టుకుని స్వయం ఉపాధి ద్వారా వ్యాపార అభివృద్ధి జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిసి బ్యాంక్ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు చింతకుంట రవీందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి కిన్నెరఅంజి , లోడింగ్ వెంకన్న, సూపర్ మార్కెట్ నిర్వాహకులు శరత్ రెడ్డి, లోకేష్ రెడ్డి, గుర్రం వెంకటరెడ్డి వల్లపు రెడ్డి దామోదర్ రెడ్డి వంగాల యాదగిరి రెడ్డి స్థానిక కౌన్సిలర్ ఇబ్రహీం ఐదవ వార్డ్ కౌన్సిలర్ పుణ్య గణేష్. శంకర్ ,పాల్గొన్నారు.

## ధాన్యాన్ని కొనుగోలు చేయాలి : మాజీ ఎంఎల్‌ఎ



ప్రజాపక్షం/దేవరకొండ : రైతులు పండించిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని వడ్లకు రూ. 500ల బోనస్ ఇవ్వాలని బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ రమావత్ రవీంద్రకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం దేవర పట్టణంలో బిఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే వరి ధాన్యానికి క్వింటాల్‌కు 500ల బోనస్ ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి మోసం చేయడం అని ఆయన అన్నారు. రాష్ట్రంలో 90శాతం రైతులు దొడ్డ వడ్లనే పండిస్తారని, ఈ విషయం తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇట్లా ఎట్లా ప్రకటిస్తదని ఆయన ప్రశ్నించారు. సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం ద్వారా తెలంగాణ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి వంచించిందని తెలిపారు. ఓట్లు డబ్బాలో పడగానే కాంగ్రెస్ వాళ్లకు రైతుల అవసరం తీరింది అని అందుకే నాలిక మల్లేసి ఎప్పటి మాదిరిగానే నయవంచనకు పూనుకున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో వడ్లను కొనగానికి నిర్లక్ష్యం వహిస్తూ రైతులను కాంగ్రెస్ ఏడిపిస్తూ గోస పెడుతుందని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ రేగటి మల్లిఖార్జున్‌రెడ్డి, ఎంపిపి మాధవరం సునిత, వైస్ ఎంపిపి సుభాష్, మండల అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, వల్లపు రెడ్డి, దస్రు, తిరుపతయ్య, ఆంజనేయులు, గిరిదర్, లింగారెడ్డి, శ్రీనివాస్, బాలయ్య, రవికుమార్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డెంగీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి




ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ : డెంగ్యూ వ్యాధిపై అవగాహన కలిగి ఉంటే అరికట్టడం సాధ్యమని యాదాద్రి భువనగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వై.పాపారావు అన్నారు. జాతీయ డెంగ్యూ వ్యాధి దినోత్సవం సందర్భంగా గురువారం భువనగిరి పాత మున్సిపల్ ఆఫీసు నుండి జిల్లా ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ పాపారావు మాట్లాడుతూ డెంగ్యూను తరిమికొట్టడానికి డెంగ్యూ వ్యాధికి కారణమైన ఎడిస్ దోమ వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని, ఇంటి చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు పుట్టకుండా, దోమలు నిల్వ ఉండకుండా దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పాత కూలర్లు, టైర్లు, ఖాళీ సీసాలలో దోమలు చేరుతాయని ఇంటి పరిసరాలలో ఇవి ఉండకుండా చూడాలని చెప్పారు. ముఖ్యంగా ఎడిస్ దోమ పగటిపూట కుడుతుందని, దోమ కుట్టడం వలన అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం రావడం, తలనొప్పి, కండరాల నొప్పి వస్తుందని అన్నారు. వ్యాధి సోకిన వారిని దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాక్సినేషన్ అధికారి, డిప్యూటీ డిఎంహెచ్‌వోలు డాక్టర్ శిల్పిని, డాక్టర్ యశోద లు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సుమన్ కళ్యాణ్, డాక్టర్ వంశీకృష్ణ డెమో మధుసూదన్ రెడ్డి, సిహెచ్‌ఓ నగేష్, ఏఎంవో మధుమోహనరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సిహెచ్ సాయి రెడ్డి తదితరులు ఉన్నారు.

## అనాధ యువకుడికి అండగా గ్రామస్తులు



ప్రజాపక్షం/ హాలియా : నడుద్దామంటే కాళ్లు పనిచేయవు.. ఎవరినైనా ఆసరా తీసుకుందామంటే కల్లు కనపడవు... ఎవరిని పిలవలేక ఎక్కడికి నడవలేక... తన బాధ ఎవరికి చెప్పలేక... చావు కోసం ఎదురుచూస్తున్న ఆ యువకుడి గాధను... గుర్తించిన గ్రామస్తులు అతనిని అక్కను చేర్చుకొని చేయి చేయి కలిపి చందాలు వేసుకొని ఆ యువకునికి చికిత్స అందిస్తు మానవత్వాన్ని చాటుకున్నారీ కొత్తపల్లి గ్రామస్తులు. సంఘటనకు సంబంధించిన వివరాలలోకి వెళ్తే అనుముల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కట్ల సాయిరాం అనే యువకుడు చిన్నతనంలోనే తోబుట్టువును, తల్లిదండ్రులను కోల్పోయాడు. నా అనేవారు ఊర్లో ఎవరూ లేకపోవడంతో బతుకుతెరువు కోసం హైదరాబాద్ పోయాడు. అక్కడ కొన్నాళ్లు పనిచేసిన తర్వాత కాళ్లు చచ్చుబడిపోవడంతో అక్కడివారు సాయిరాం సొంత గ్రామమైన కొత్తపల్లికి తీసుకువచ్చారు. నా అని చేరదీసేవారు ఎవరూ లేకపోవడం పనిచేసుకునేందుకు కాలు కూడా సహకరించకపోవడంతో పొట్ట గడవడం కష్టంగా మారింది. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించి మంచం పట్టాడు. ఈ క్రమంలోనే సాయిరాం తన కంటి చూపును కూడా కోల్పోయి జీవచ్చవంలా మారాడు. నడిచేందుకు కాలు పనిచేయక చూసేందుకు కళ్ళు లేక కదుపునింపే దిక్కు లేక అల్లాడుతున్న ఆయువకున్ని చూసిన గ్రామస్తులు చలించిపోయారు. దీంతో రోజువారీగా ఉపాధి పనులకు పోతున్న కూలీలు తాము పని చేస్తున్న పనుల వద్ద ఆ యువకుల గురించి చర్చించుకొని తలా కొంత చేయి వేసి చికిత్స చేయించాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా గత రెండు రోజుల నుంచి ఉపాధి కూలీలు 30 వేల రూపాయలు పోగు చేశారు. ఆ డబ్బుతో ముందుగా ఆ యువకుడు నడిచే విధంగా చూడాలని నల్లగొండలోని నవ్య హాస్పిటల్ వైద్యులను కలిశారు. అతని పరీక్షించిన వైద్యులు కళ్ళు కనిపించడం సాధ్యం కాకపోవచ్చని కాళ్లు పనిచేసేలా పరీక్షలు చేద్దామని తెలిపినట్లు గ్రామస్తులు తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో పరీక్షలు చేసిన తర్వాత ఆ యువకునికి పూర్తిస్థాయి చికిత్స అందించేందుకు గ్రామ యువకులు కూడా ముందుకు రావడం హర్షించదగ్గ విషయం. యువకునికి అన్ని విధాల చేయూత ఇచ్చేందుకు గ్రామ యువకులు పాతబైన సురేష్, మేకల సతీష్, శివమణి, సంజయ్, ఈశ్వర్, అరవింద్, శ్రీను గౌడ్, నాగయ్య ,సైదులు ,రామయ్య, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్ బాధ్యతలు తీసుకున్నారు.

## హత్యను చేధించిన పోలీసులు

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి : గత వారం మండల పరిధిలోని ఆంగోతు తండాలో జరిగిన దారుణ హత్యను పోలీసులు చేధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 8వ తేదిన ఆంగోతు తండాలో ఇంటి ముందు నిద్రిస్తున్న ఆంగోతు జగ్గు దారుణ హత్యకు గురయ్యాడు. మృతుని భార్య బుజ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కొండమల్లేపల్లి ఎస్ఐ రామ్మూర్తి, సిఐ ధనుంజయ ఆధ్వర్యంలో పరిశోధన ప్రారంభించి నిందితులు ఆంగోతు తండాకు చెందిన ఆంగోతు బాలు, ఆంగోతు తేజలను గుర్తించారు. ఆంగోతు బాలును అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. ఆంగోతు తేజ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలియజేశారు. గతంలో జరిగిన పొలం గెట్ల తగాదాలను మనసులో ఉంచుకొని ఈ హత్య చేసినట్లు నిందితుడు బాలు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. నేరస్తుల వద్ద నుండి ఒక పల్సర్ బైక్, సెల్ ఫోన్, రెండు పదునైన గొడ్డల్లు స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. చాకచక్యంగా తక్కువ కాలంలో కేసును చేధించిన కొండమల్లేపల్లి సిఐ ధనుంజయ, ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి, గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు, క్రైం పార్టీ సిబ్బంది హేమునాయక్, భాస్కర్, సత్యనారాయణ, గురువారెడ్డి, రవి, సైదులు లను దేవరకొండ డిఎస్పి గిరిబాబు అభినందించారు.

## రాకేష్‌రెడ్డి విజయానికి కృషి చేయాలి



ప్రజాపక్షం/కోదాడ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బిఆర్‌ఎస్ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, ఎన్నికల పరిశీలకులు కటికం సత్తయ్య గౌడ్‌లు అన్నారు. గురువారం బిఆర్‌ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాక సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 27న జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి గెలుపు కోసం పట్టభద్రులను చైతన్యపర్చాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను యువతలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకగా బిఆర్‌ఎస్ అభ్యర్థి పోరాడుతారన్నారు. యువత అంతా బిఆర్‌ఎస్‌వైపే ఉన్నదన్నారు. విద్యావంతుడు యువకుడు బిఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించేందుకు తీవ్రంగా కృషి చేయాలన్నారు. నమోదైన పట్టభద్రులను ఇంటింటికి తిరిగి కలిసి చైతన్యపర్చాలని పిలుపునిచ్చారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ శాసనమండలి ఎన్నికల్లో బిఆర్‌ఎస్ విజయదుందుభి మోగించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకులు,ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు, మండల పార్టీ బాధ్యులు, అన్ని స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/కోదాడ : పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో జూన్ 8వ తేదీన జరగబోయే లోక్‌అదాలత్‌ను కక్షి దారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్యాంసుందర్ అన్నారు. గురువారం కోర్టు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కక్షిదారులకు లోక్ అదాలత్ గురించి చైతన్యపర్చాలని న్యాయవాదులను కోరారు. సమావేశంలో ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి సిహెచ్ సత్యనారాయణ, పిపి బొబ్బ కోటిరెడ్డి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గట్ల నరసింహారావు, బార్ అసోసియేషన్ సభ్యులు మంద వెంకటేశ్వర్లు, కోదూరు వెంకటేశ్వర్లు, హేమలత, దొడ్డ శ్రీధర్, షేక్ నాగుల్‌పాషా, సీనియర్ న్యాయవాదులు రంగారావు, సిలివేరు వెంకటేశ్వర్లు, షేక్ అబ్దుల్ రహీం, ఉయ్యాల నరసయ్య,రంజాన్ భాష, రియాజ్, బాలయ్య, శరత్‌కుమార్, మండల లీగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు.